క్లుప్తంగా

డీఈఎల్ఈడీ పరీక్షలకు 112 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్పేట): డీఈఎల్ఈడీ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 67 మందికి 64 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాం ఒక ప్రకటనలో తెలిపారు. డీఈఎల్ఈడీ ఒకటో సెమిస్టర్ పరీక్షకు 50 మంది అభ్యర్థులకు 48 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని తెలిపారు.

ఓటుహక్కుపై కళాజాత బృందం అవగాహన



కూలీలకు అవగాహన కల్పిస్తున్న బృందం

ఏలూరు రూరల్ : గ్రామీణ ప్రజల్లో ఓటు హక్కు వినియోగంపై కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సోమవారం ఏలూరు రూరల్ మండలం మల్కాపురం, చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, గుడివాకలంక గ్రామాల్లో కళాజాతా బృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఆయా గ్రామాల్లో పని ప్రాంతాల్లో కూలీలకు ఓటు హక్కు వినియోగించుకోవడం వల్ల ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకోవచ్చని వివరించారు. వృద్ధులు, యువతీ, యువకులు తప్పనిసరిగా ఓటు ఉపయోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరుచుకోవాలని సూచించారు.

వైభవంగా నగరేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



నగరేశ్వర స్వామి

ఏలూరు (ఆర్ఆర్పేట): స్థానిక అగ్రహారం శ్రీ గంగ, వింధ్యవాసినీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశేష పూజలు, హోమం, బలిహరణ పూజలు, సాయంత్రం హోమం బలిహరణ పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుకోలు సన్నాహం నిర్వహించారు. స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- 7వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం

ఏలూరు టౌన్: రాష్ట్రంలో 59 నెలల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో ప్రజలకు చేరువయ్యారని, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని కోరారు. ఏలూరు వన్‌టౌన్ 7వ డివిజన్‌లో ఆయన కార్పొరేటర్ పిల్లగోళ్ల శ్రీదేవి, రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బెనర్జీ పేట, పాండురంగా థియేటర్ వెనుక సందు, డాక్టర్ కోనేరు రామకృష్ణ హాస్పటల్ వద్ద నుంచి పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు, చిన్నారులను ఆప్యాయంగా పలకరిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు ఇవ్వాలని కోరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. వారు మరోసారి ప్రజలను మోసం చేసేందుకు జట్టుకట్టారని ఆరోపించారు. 2014లో ఎన్నికల సమయంలో ముగ్గురు కలిసి ఇచ్చిన ఎన్నికల హామీలను ఏ మేరకు అమలు చేశారో ప్రజలే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే నాని కోరారు. 2024లో మరోసారి కూటమిగా వస్తూ మోసం చేసేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని పేద, మధ్య తరగతి వర్గాలకు మరింత సంక్షేమం అందుతుందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఏలూరు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ నాయకులు పాలడుగు మురళీశ్యామ్, ఉక్కుసూరి రమేష్, సైదు ఏడుకొండలు, ఎండీ అస్లాం షరీఫ్, భగవాన్, గోపి, కొండా, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



7వ డివిజన్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని



జై జగన్ అంటూ నినదిస్తున్న వలంటీర్లు, ఎమ్మెల్యే నాని, పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

ఏలూరు టౌన్: ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ఏలూరు నగరంలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేము సిద్ధం.. మా బూత్ సిద్ధమంటూ ప్రతి గడప కూ వెళ్లారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఏలూరు వన్‌టౌన్ 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు మరోసారి అమలు కావాలన్నా.. పేదలకు సంక్షేమం అందాలన్నా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నానిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- 37వ డివిజన్‌లో ఎమ్మెల్యే ఆళ్ల నాని విజయానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరుతూ జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, సీహెచ్ రామనాగశంకర్, తోలేటి శ్రీనివాస్ తదితరుల ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. టీడీపీ మోసపూరిత వాగ్దానాలను విశ్వసించవద్దని ప్రజలను కోరారు. కార్యక్రమంలో రత్నా పెయింట్స్ కుమార్, సారిక దుర్గ, కనపర్తి నవీన్, అఖిల, మహాలక్ష్మి, సువర్చల, స్వర్ణజ్యోతి, బొండాడ దుర్గా, బెల్లంకొండ సుజాత, కోమర్తి సత్యలక్ష్మి, తదితరులున్నారు.



16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ విజయనిర్మల, నాయకులు రమేష్



37వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే నాని, కార్పొరేటర్ శ్రీదేవి

రూ.13.60 కోట్ల వస్తువులు, నగదు, మద్యం సీజ్

- 388 సి-విజిల్ ఫిర్యాదుల పరిష్కారం
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల కోడ్ అములులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తంగా రూ.13.60 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. సీజ్ చేసిన వాటిలో రూ.201.57 లక్షల నగదు, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.133.34 లక్షల విలువైన మద్యం ఉందన్నారు. సువిధ /ఎన్ కోర్ ద్వారా ఇంతవరకు 1949 అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 1983 అభ్యర్థనలు రాగా, వాటిలో ఇప్పటి వరకు 1949 అనుమతులు జారీ చేయగా మరో 34 పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. సి-విజిల్ ద్వారా 388 ఫిర్యాదులు, మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలపై వచ్చిన 106 ఫిర్యాదులకు పరిష్కారం చూపామని తెలిపారు. ఎన్‌జీఎస్‌పీ పోర్టల్ ద్వారా స్వీకరించిన 601 ఫిర్యాదుల్లో 600 పరిష్కరించగా, ఒకటి పరిశీలనలో ఉందని వివరించారు. ప్రజలు నగదు లేదా ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లే సమయంలో సంబంధించి ఆధార పత్రలను వెంట ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.

లెనిన్‌కు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): లెనిన్ జయంతి కార్యక్రమం పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ పార్టీ జిల్లా నేతలు పి.కిషోర్, బి.జగన్నాథరావు, ఎం సత్యం పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు ఎంకే చైతన్య, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం సచివాలయ వ్యవస్థ



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని కలిసిన వలంటీర్లు, సత్తిబాబు



ఎమ్మెల్యే నానిని కలిసిన వలంటీర్లు, కార్పొరేటర్ ఇలియాస్ పాషా

ఏలూరు టౌన్: ప్రభుత్వం సేవలు నేరుగా ప్రతి ఇంటికీ చేరేందుకు ఏర్పాటుచేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు 11వ డివిజన్, 47, 48, 49 సచివాలయాల పరిధిలోని సుమారు 20 మంది వలంటీర్లు, 45వ డివిజన్ 21వ సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లు

30 మంది వలంటీర్ల రాజీనామా

సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకులు వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ తమ మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, వారికి బుద్ధిచెప్పాలనే రాజీనామా చేశామని వలంటీర్లు తెలిపారు. ప్రభుత్వ అందిస్తోన్న సంక్షేమంలో తాము భాగస్వాములు కావటం సంతోషంగా ఉందని, నాయకులు కుట్రలతో తమపై బురదజల్లే కార్యక్రమాలు నీచ సంస్కృతికి, రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ వలంటీర్లకు అండగా ఉంటామని, రాబోయే ప్రభుత్వంలో ప్రజలకు మరోసారి సేవలు అందించేలా ప్రోత్సహిస్తామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ కోయ జయగంగ, పార్టీ నేత కోయ సత్తిబాబు, 45వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ ఇలియాస్ పాషా, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ నాయకులు మోర్త రంగారావు, అలా గణేష్, మస్తాన్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

ఏలూరు(మెట్రో): జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సన్నద్ధతను పరిశీలించేందుకు సోమవారం సాయంత్రం రాష్ట్ర ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగమ్ ఏలూరు విచ్చేశారు. కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ మీడియా కంట్రోల్ రూమ్‌ను ఆమె సందర్శించి, నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై మీడియాలో వచ్చే ప్రతికూల వార్తల నమోదు, వాటి పరిష్కార తీరును కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నారు. పేస్ బుక్, వాట్సాప్, ట్విట్టర్, మాధ్యమాల్లో వచ్చే రాజకీయ ప్రకటనలు, సంబంధిత అంశాలను పరిశీలించి, రిటర్నింగ్ అధికారుల ద్వారా అవసరమైన చర్యలు తీసుకొంటున్నట్టు కలెక్టర్ వివరించారు. అనంతరం సి విజిల్ పర్యవేక్షక విభాగాన్ని నీనా నిగమ్ పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్, ఫ్లెయింగ్ సర్వేలెన్స్ టీంల వాహనాల జీపీఎస్ విధానం ద్వారా కంట్రోల్ రూమ్ నిర్వహణ తీరుపైనా ఆరా తీశారు. ఎన్నికల కమిషన్‌కు రోజువారీ నివేదికలు పంపే విభాగాన్ని సందర్శించారు. జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రశాంతి నీనా నిగమ్‌కు వివరించారు.



నీనా నిగమ్‌కు మొక్కను అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జిల్లాలో స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను నీనా నిగమ్ తిలకించారు. తొలుత నీనా నిగమ్‌కు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి స్వాగతం పలికి పూల మొక్కలు అందజేశారు. వీరి వెంట డీఆర్వో డి.పుష్పమణి, జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు, సోషల్ మీడియా నోడల్ అధికారి రామ్మోహన్, సి విజిల్ నోడల్ అధికారి ఎస్ఎస్ కృపావరం, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	34	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	84
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	04, 06
బెండకాయలు	24	కంద	64
పచ్చిమిర్చి	40-48	బీట్‌రూట్	32
కాకర కాయలు	36	కీరా దోస	34
బీరకాయలు	24	ఫ్రెంచ్‌బీన్స్	104
బీరకాయలు (పందిరి)	44	అల్లం	170
క్యాబేజీ	30	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	36-48	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	08
ఉల్లిపాయలు	25	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	32

ఏలూరు రూరల్ గ్రామాల్లో 69 శాతం ఉత్తీర్ణత

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ఏలూరు రూరల్ : పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏలూరు రూరల్ గ్రామాల విద్యార్థులు 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. చాటపర్రు, మాదేపల్లి, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, శ్రీపర్రుతో పాటు శనివారపుపేట, సత్రంపాడు, పోణంగి జెడ్పీ పాఠశాల నుంచి మొత్తంగా 2,123 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 1,474 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 917 మందికి 577 మంది, బాలికల్లో 1,206 మందికి 897 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా శ్రీపర్రు జెడ్పీ స్కూల్ బాలురు 88 శాతం, బాలికలు 83 శాతం, అత్యల్పంగా గుడివాకలంక బాలురు 17 శాతం, బాలికలు 25 శాతం ఉత్తీర్ణత సాధించారు. మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి లీలా సాయికృష్ణ 573 మార్కులు, యర్రబోలు నేహ 570, బేతాల అభిలాష్ 540 మార్కులు సాధించి స్కూల్ స్థాయిలో మొదట మూడు స్థానాల్లో నిలిచారని ఉపాధ్యాయుడు పువ్వుల ఆంజనేయులు తెలిపారు. శనివారపుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థి మురాల మహేష్‌బాబు 588 మార్కులు సాధించి పాఠశాలల స్థాయిలో మొదట స్థానంలో నిలిచాడు.



లీలాసాయికృష్ణ (573)



యర్రబోలు నేహ (570)

సత్తా చాటిన బధిరులు

దొండపాడు పరివర్తన పాఠశాల విద్యార్థులు టెన్త్ పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 9 మంది బాలబాలికలు పరీక్షలు రాగా, వీరంతా పాసయ్యారని వివరించారు. ప్రత్యేక ఉపాధ్యాయులతో విద్యాబుద్ధులు నేర్పడంతో ఉత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు.

సాయుధ బలగాల మార్చ్‌ఫ్లాగ్



సాయుధ బలగాలతో మార్చ్‌ఫ్లాగ్ నిర్వహిస్తున్న ఎస్సై రాజారెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ ప్రాంతాల్లో ఏలూరు రూరల్ పోలీసులు సాయుధ బలగాలతో కలిసి మార్చ్‌ఫ్లాగ్ నిర్వహించారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు వన్‌టౌన్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ ఎస్సై రాజారెడ్డి తమ సిబ్బందితో రూరల్ ప్రాంతంలో ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని, భయం లేకుండా నిష్పక్షపాతంగా ఓటు వేయాలని ఎస్సై కోరారు. ఏలూరు రూరల్ మాదేపల్లి, ఇందిరాకాలనీ, లింగారావుగూడెం, గురుకలపేట, శ్రీపర్రు గ్రామాల్లో సాయుధ బలగాలతో ఫుట్‌పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రజలు ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే తమకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్సై రాజారెడ్డి హెచ్చరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	21
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	00

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	48202	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

సిద్ధార్థ విద్యార్థుల విజయకేతనం



కె.సాకేత్



కేఎస్ పల్లవి సాయి



ఆర్ తేజేష్



కె.క్రిస్టిన్



ఇ.దేదీప్య



ఎస్కే హబీబా

ఏలూరు (ఆర్ఆర్పేట): పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారని నగరంలోని సిద్ధార్థ విద్యా సంస్థల అధినేత కోనేరు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కె.సాకేత్ 584, కేఎస్ పల్లవి సాయి 579, ఆర్ తేజేష్ 578, కె.క్రిస్టిన్ 574, ఇ.దేదీప్య 570, ఎస్కే హబీబా 570 మార్కులు సాధించారని పేర్కొన్నారు. తమ విద్యార్థుల్లో 12 మంది 550కు పైగా, 36 మంది 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. మొత్తం 101 మంది పరీక్షలకు హాజరు కాగా 93 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని వివరించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అందుకు సహకరించిన ప్రిన్సిపాల్స్, అధ్యాపకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

నేడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

దెందులూరు: మండలంలో మంగళవారం ఉదయం సానిగూడెం, సాయంత్రం జోగన్నపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం సోమవారం తెలిపారు.

అనుమతుల్లేని ఫ్లెక్సీల తొలగింపు

ఏలూరు(మెట్రో): అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించినట్టు ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న టీడీపీ ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నామినేషన్ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలకు అనుమతి లేకపోవడంతో ఎంసీసీ బృందం తొలగించిందన్నారు. ఈ మేరకు 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారని ముక్కంటి పేర్కొన్నారు.